# నేడు కొందుర్గుకు సీఎం రాక

- నూతనంగా నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ భవనానికి శంకుస్థాపన చేయనున్న సీఎం
- మధ్యాహ్నం ఒంటి గంటకు బహిరంగ సభ
- సభా స్థలాన్ని పరిశీలించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కొందుర్గులో సీఎం సభ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబర్10: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ భవనానికి సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. సీఎం పర్యటన నేపథ్యంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, శంషాబాద్ డీసీపీ రాజేశ్‌లు సీఎం సభా స్థలాన్ని పరిశీలించారు. సభను నిర్వహించే ప్రాంతాన్ని జెసీబీలతో చదును చేయించారు. ప్రోటోకాల్, భద్రత, హెలీప్యాడ్ ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించారు. సభా స్థలం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చేపట్టాలని నిర్వహించాలని అధికారులకు సూచించారు. సీఎం రాక నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఉంటుందని డీసీపీ వివరించారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సీఎం హోదాలో మొదటిసారిగా షాద్‌నగర్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారని తెలిపారు. అన్ని గ్రామాల నుంచి సభా ప్రాంగణానికి చేరుకునేందుకు వాహనాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపి ప్రజలు సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సీఎం పర్యటనపై స్థానికుల ఆశలు**

మొదటిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి షాద్‌నగర్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు ఆయనపై గంపెడాశలు పెట్టుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కేటాయింపుతో పాటు పథకాల అమలుపై నిర్ణయం తీసుకుకోవాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై సీఎం ప్రకటన చేయాలని భావిస్తున్నారు. రైతు భరోసా పథకానికి నిధులు విడుదల, రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ, రూ.4వేల పింఛన్, మహిళా ఖాతాల్లో రూ.2500 నగదు తదితర పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నారు. షాద్‌నగర్ పట్టణ ముఖ్యకూడలి విస్తరణకు అధిక నిధుల కేటాయింపు, చటాన్‌పల్లి రైల్వే వంతెన నిర్మాణల పనుల ప్రారంభం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం, మండల పరిషత్ ఆవరణలో ఉన్న ఆడిటోరియం నిర్మాణం, మోడల్ వెజ్ మార్కెట్ తదితర అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేపట్టే పలు అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నారు. కొందుర్గు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణ, చౌదరిగూడ మండలంలో మండల పరిషత్ భవన నిర్మాణం, షాద్‌నగర్ నుంచి పరిగి వరకు ఉన్న ప్రధాన రహదారిని నాలుగు వరుసల దారిగా విస్తరణ తదితర అభివృద్ధి పనులకు నిధులను అడుగనున్నారు.

## నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపనకు ఏర్పాట్లు


పూడూరులో నేవీ రాడర్ సిగ్నల్ స్టేషన్ (శంకుస్థాపన) శిలాపలక నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన దిమ్మె

పూడూరు, అక్టోబర్ 10: దామగుండ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలో నేవీ సిగ్నల్ రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసేందుకు సంబంధిత ఉన్నతాధికారులు పనులను ముమ్మరం చేశారు. పూడూరు మండల పరిధిలోని దామగుండం ఆలయ ప్రాంతంలో 2,900 ఎకరాల అటవీ భూమిని నేవీ సిగ్నల్ రాడార్ స్టేషన్ ఏర్పాటు కోసం 12 ఏండ్ల క్రితం ఎంపిక చేశారు. ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులతో పనుల ప్రారంభోత్సవానికి శిలా పలక ఏర్పాటుతో పాటు, భూమి పూజ చేసేందుకు వికారాబాద్-దామగుండం మధ్యలో టేకులబీడుతండా సమీపంలో సంబంధిత నేవీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**13న కొడంగల్‌కు సీఎం రాక**

**కొడంగల్ :** దసరా ఉత్సవాన్ని పురస్కరించుకొని కార్యకర్తలను కలిసేందుకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగా దసరా వేడుకల సందర్భంగా కొడంగల్‌కు వస్తారని తెలిపారు. ఆదివారం కొడంగల్‌లో సీఎం కార్యకర్తలను కలవనున్నట్లు పేర్కొన్నారు.

# సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి, అక్టోబరు 10 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోసం సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ గుర్తింపు పొం దిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పు, సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో 1,500 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వాటికి సంబంధించిన సహాయక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ప్రతిపాదించిన సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, లొకేషన్ల మార్పు వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ పోలింగ్ కేంద్రాలపై ఏమైనా సందేహాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్, సీపీఐ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ను వెంటనే డెలివరీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబర్ 10: లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలోపు డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సీఎంఆర్ ఖరీఫ్, రబీ 2023-24 డెలివరీల విషయమై రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ఎఫ్‌సీఐ, సీఎస్‌సీకి అక్టోబర్ 31లోపు డెలివరీ చేయాలని ఆదేశించారు. అలాగే 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మిల్లర్లు అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సమీక్షలో పౌర సరఫరాల జిల్లా అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

# విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా మెలగాలి


దవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్, అక్టోబర్ 10: అధికారులు విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా మెలగాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. గురువారం బొంరాస్‌పేట మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో భూముల సమస్యలు పరిష్కారం కావడంతో ఆలస్యం అవుతుందని, కల్యాణలక్ష్మి దరఖాస్తు పత్రాలపై గెజిటెడ్ అధికారులు సంతకం చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మెట్లకుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నర్సింహులు నాయుడు సబ్ కలెక్టర్‌కు తెలిపారు. స్పందించిన ఆయన ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఒక్కో ఉద్యోగితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయుష్ వైద్యాధికారి గోపాల్ అందుబాటులో లేకపోడంతో సబ్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం మందులు, ల్యాబ్‌తో పాటు ఆపరేషన్ గదిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# అర్హులకే ఉద్యోగాలు ఇవ్వాలి


డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న అభ్యర్థులు, తపస్ జిల్లా అధ్యక్షుడు

వికారాబాద్, అక్టోబర్ 10 : డీఎస్సీ 2024లో అర్హత కలిగిన అభ్యర్థులకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని డీఎస్సీ అభ్యర్థులు, ఉపాధ్యాయుల సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే మరోసారి ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

## నేడు గురుకులాల నిర్మాణానికి భూమిపూజ

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్**


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్, అక్టోబర్ 11: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామ శివారులో గురుకుల పాఠశాలల భవన నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేపట్టనున్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం గురుకుల పాఠశాలల నిర్మాణ స్థలాన్ని సందర్శించి, భూమి పూజ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేయాలి

- పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దాన కిశోర్
- భూముల క్రమబద్ధీకరణపై పలు సూచనలు


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అదనపు కలెక్టర్, అధికారులు

వికారాబాద్, అక్టోబర్ 10 : సరళీకృత చెల్లింపు పథకం (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా భూములు క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను పూర్తి చేయాలని పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ అన్నారు. గురువారం స్థానిక సంస్థలు, అదనపు కలెక్టర్లతో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా భూములు క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధి విధానాలు, ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ శాఖల సమన్వయంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్తించిన మహిళా శక్తి క్యాంటీన్ గ్రౌండింగ్ పనుల వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గౌతమ్ పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన మహిళా శక్తి క్యాంటీన్లు పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్‌లో ఏర్పాటు చేసే మహిళలకు శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీసీలో మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, డీటీసీపీవో తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : సురసముద్రం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు


పెద్దఅంబర్‌పేట: మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరు కొలన్ శివారెడ్డి కాలనీలో బతుకమ్మ సంబురాలు


నందిగామ : బతుకమ్మల వద్ద కోలాటమాడుతున్న మహిళలు


షాబాద్: దుర్గామాత మండపం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# సంబురంగా సద్దుల బతుకమ్మ

బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. పల్లెల నుంచి పట్నం వరకు వాడలన్నీ పూలవనాలుగా మారాయి. మహిళలు, చిన్నారులు, యువతుల పాటలతో సందడి నెలకొన్నది. ఎంగిలి పూలతో మొదలైన సంబురాలు సద్దులతో ముగిశాయి. గునుగు, తంగేడు, తీరొక్క పూలను పేర్చిన బతుకమ్మలను సాయంత్రం గ్రామ, వార్డు కూడల్లోకి తీసుకొచ్చి ఉయ్యాల పాటలు పాడారు. పాటకు తగ్గట్లు చప్పట్లు చరుస్తూ ఆటలాడారు. తొమ్మిది రోజుల సద్దుల బతుకమ్మగా గౌరమ్మను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచారు. అనంతరం మహిళలు చెరువులో నిమజ్జనం చేశారు. **- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తేతెలంగాణ, అక్టోబర్ 10**


ఇబ్రహీంపట్నంరూరల్ : సద్దుల బతుకమ్మను అలంకరిస్తున్న మహిళలు



షాబాద్: షాబాద్‌లో బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు


ఆమనగల్లు: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మంచాల: ఆరుట్లలో ఒకేరంగు చీరలు ధరించి బతుకమ్మ ఆడుతున్న యువతులు


చేవెళ్లటౌన్: ముడిమ్యాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మొయినాబాద్: చిలుకూరులో..


షాద్‌నగర్ టౌన్: బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


కడ్తాల్: మండల కేంద్రంలో..